క్లుప్తంగా

కొండాపురంలో చోరీ

కొండాపురం : మండల కేంద్రంలోని పాత కొండాపురానికి చెందిన రంగాంజినేయులు ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం పగలు చోరీ చేశారు. బాధితుడి వివరాల మేరకు తాను తాడిపత్రికి వెళ్లగా తన భార్య నాలుగు రోడ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న చోటకు పనికి వెళ్లిందన్నారు. కూలి పనులు ముగించుకొని ఇంటి వద్దకు రాగా తలుపు తెరచి ఉందన్నారు. లోపలికి వెళ్లి చూడగా రూ.36 వేలు నగదు, రెండు జతల కమ్మలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించామన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

రూ.20వేలు ఎత్తుకెళ్లారు..

ముద్దనూరు : ముద్దనూరు మండల కేంద్రంలో స్టేట్ బ్యాంకు వెనుక వీధిలో ఓ ఇంటిలో శనివారం పగలు చోరీ జరిగింది. ఇంటిలోని వారు తలుపులు వేసి ఓ శుభకార్యానికి వెళ్లిన సమయంలో తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో ఉన్న రూ.20వేల నగదు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని బొగుడుపల్లి రింగ్ రోడ్డు సమీపంలో విజయ్ అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. భాకరాపురంలో నివాసం ఉంటున్న ఇతను శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో రింగు రోడ్డు సమీపంలోని రోడ్డులో పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గుర్తుతెలియని వాహనం ఏదైనా ఢీకొందా లేక ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు- లారీ ఢీ



ప్రమాదంలో పగిలిన బస్సు ముందువైపు అద్దం

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో ఓబుళాపురం గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు–లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు, లారీ అద్దం పగిలిపోయాయి. ప్రొద్దుటూరు డిపోకు చెందిన బస్సు తాడిపత్రి నుంచి ప్రొద్దుటూరు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు ప్రయాణికులెవరికీ ఎటువంటి గాయాలు కాలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

పండక్కి ఊరికి వస్తానంటివే.!

- గోడ కూలి హిటాచీ డ్రైవర్ దుర్మరణం
- స్పిన్నింగ్‌మిల్లు పాత భవనాలను కూలదోస్తుండగా ఘటన
- పనిచేస్తున్న వాహనంలోనే పోయిన ప్రాణం



రమేష్‌రెడ్డి, ప్రవీణ దంపతులు(ఫైల్)



ప్రమాదానికి కారణమైన హిటాచీ వాహనం



హిటాచీలో రక్తమోడుతున్న డ్రైవర్ రమేష్‌రెడ్డి మృతదేహం

మదనపల్లె : ఈరోజు పనిచూసుకుని పండక్కి ఇంటికి వచ్చేస్తానమ్మా.. అమ్మను ఇబ్బంది పెట్టకండి. చక్కగా చదువుకోండి. వచ్చేటప్పుడు మీకు కావాల్సినవి తీసుకువస్తా అని చెప్పిన మా నాన్న ఎందుకు చనిపోయాడు అంటూ పిల్లలు ఏడుస్తున్న తీరు ప్రభుత్వాసుపత్రిలో పలువురిని కలచివేసింది. మదనపల్లె మండలం సీటీఎం స్పిన్నింగ్ మిల్లులో పాత భవనాలను తొలగిస్తుండగా, ప్రమాదవశాత్తు భవనం గోడ హిటాచీ వాహనం మీద పడి డ్రైవర్ వాహనంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన శనివారం జరిగింది. గోడ ఒక్కసారిగా వాహనం మీద పడటంతో డ్రైవర్ శరీరం వాహనంలో ఇరుక్కుపోయి రక్తసిక్తమైంది. వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం కుమారునిపల్లెకు చెందిన నారాయణరెడ్డి, జయమ్మ దంపతుల కుమారుడు ఎస్.రమేష్‌రెడ్డి(40) హిటాచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఉపాధి నిమిత్తం కదిరి పట్టణం అడపాలవీధి పంచాయతీ కార్యాలయం సమీపంలో నివసిస్తున్నాడు. ఇతనికి భార్య ప్రవీణ, కుమార్తెలు సాహితి(13), భవ్యశ్రీ(11), కుమారుడు రోచన్‌రెడ్డి(4) ఉన్నారు. స్థానికుడైన ఎస్వీ కన్‌స్ట్రక్షన్స్ యజమాని, కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి వద్ద 15 ఏళ్లుగా రమేష్‌రెడ్డి హిటాచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండునెలల క్రితం సీటీఎం స్పిన్నింగ్ మిల్లు భవనాల తొలగింపు, చదును పనుల కోసం రమేష్‌రెడ్డి ఇక్కడకు వచ్చి పని చేస్తున్నాడు. పనులు దాదాపు చివరిదశకు చేరుకున్నాయి. కేవలం ఐదురోజుల పని మాత్రమే మిగిలి ఉంది. ఈ క్రమంలో శనివారం పని చేసి, పండుగకు ఇంటికి వస్తానని రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులకు శుక్రవారం రాత్రి ఫోన్ చేసి చెప్పాడు. అయితే శనివారం ఉదయం హిటాచీతో స్పిన్నింగ్ మిల్లులోని పాత భవనాన్ని తొలగిస్తుండగా, శిథిల స్థితిలో ఉన్న పెద్దగోడ అటువైపు పడుతుందనే ఆలోచనతో, హిటాచీతో నెట్టుతుండగా, ప్రమాదవశాత్తు వాహనం మీద పడిపోయింది. డ్రైవర్ సీటులో ఉన్న రమేష్‌రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం పాలై గోడ శిథిలాల కింద చిక్కుకుపోయి రక్తమోడుతూ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. ప్రమాదంలో హిటాచీ వాహనం ధ్వంసమైంది. గమనించిన తోటిపనివారు పోలీసులకు, కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు, పోలీస్ సిబ్బంది, స్థానికుల సహాయంతో శిథిలాలను తొలగించి, వాహనంలో ఇరుక్కుపోయిన రమేష్‌రెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటనకు సంబంధించిన వివరాలను అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రమేష్‌రెడ్డి భార్య ప్రవీణ ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని రమేష్‌రెడ్డి మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న యజమాని గుర్తుపట్టలేని స్థితిలో శవమై పడి ఉండటాన్ని చూసిన భార్య, పిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కారు పల్టీ కొట్టి ఎనిమిది మందికి గాయాలు



పల్టీ కొట్టిన కారు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని పోలిబుచ్చయ్యగారిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై శనివారం కారు పల్టీ కొట్టిన ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం, తిప్పాయపల్లి గ్రామస్తులు వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లి పుల్లంపేటకు తిరుగు ప్రయాణమయ్యారు. మండల పరిధిలోని పోలుబుచ్చయ్యగారిపల్లి గ్రామం వద్ద షిఫ్ట్ డిజైర్ కారు అతివేగంతో వస్తూ అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో కారులో ఉన్న ఐదుగురు పెద్దలు, ముగ్గురు చిన్నపిల్లలకు గాయాలయ్యాయి. వీరిలో హిమబిందు (22) అనే మహిళ తలకు, కాలికి బలమైన రక్తగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఒంటిమిట్ట పోలీసులు నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

కన్నబిడ్డలను కాటేసిన తండ్రి అరెస్టు



బోయకొండ (ఫైల్)

మదనపల్లె : కన్న కూతుళ్లపై అఘాయిత్యానికి పాల్పడిన కసాయి తండ్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ డి.కొండయ్యనాయుడు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లె దాసరిపేటకు చెందిన చెన్నూరుబోయకొండ(30) కూలి పనులకు వెళుతూ, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతడి భార్య చిట్టెమ్మ జీవనోపాధి కోసం ఊరురా తిరుగుతూ గాజులు విక్రయించేది. వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తల్లి ఇంటిపట్టున లేకపోవడంతో అమ్మమ్మ పిల్లల బాగోగులు చూసుకునేది. ఈనెల 6వ తేదీన బోయకొండ ఇద్దరు కూతుళ్లు కడుపునొప్పి తాళలేకపోతున్నామంటూ అమ్మమ్మ, మేనమామతో చెప్పుకున్నారు. వారు ఎందుకని ఆరా తీయగా, తండ్రి చేసిన అఘాయిత్యాన్ని వివరించారు. దీంతో వారు సమాచారాన్ని తల్లి చిట్టెమ్మకు తెలపడంతో ఆమె నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో భర్త బోయకొండపై ఫిర్యాదు చేసింది. రూరల్ సర్కిల్ సీఐ రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ప్రాథమికంగా తండ్రి బోయకొండ బిడ్డలపై అఘాయిత్యానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు విచారణ చేశారు. నిందితుడు బోయకొండను శనివారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

మెలకువలతో ఆరోగ్యకరమైన లేగదూడలు

వల్లూరు (చెన్నూరు) : లేగదూడలను పెంచడంలో మెలకువలు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన లేగదూడలు పెరుగుతాయని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ సి.శారదమ్మ తెలిపారు. మండలంలోని నరసారెడ్డిపల్లెలో శనివారం డీపీఎల్ డీపీ కడప వారి ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాడి రైతులు లేగ దూడల పెంపకంలో మెలకువలు పాటించినట్లయితే దూడలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న 42 దూడలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులురెడ్డి, డీపీఎల్‌డీపీ డాక్టర్లు, పాడి రైతులు పాల్గొన్నారు.

రవాణాశాఖ అధికారుల తనిఖీలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రవాణాశాఖ అధికారులు పలు ప్రైవేట్ ట్రావెల్స్‌పై శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. పర్మిట్ లేకుండా తిరుగుతున్న రెండు ట్రావెల్స్‌కు రూ. 5.24 లక్షలు జరిమానా విధించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా సరుకు రవాణా చేస్తున్న రెండు బస్సులకు రూ. 20 వేలు, ఎఫ్‌సీ లేని మరో బస్సుకు రూ. 5 వేలు జరిమానా విధించినట్లు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు.

ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న ట్రెజరీ ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక శనివారం కడపలో నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రవికుమార్ సమక్షంలో ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షునిగా జె.ప్రభుదాస్, అసోసియేట్ అధ్యక్షునిగా ఎస్.రవిశేఖర్, ఉపాధ్యక్షులుగా పి.ఉదయశంకర్‌రెడ్డి, ఎస్.తిరుపతిస్వామి, డి.రబియాబేగం, కార్యదర్శిగా ఎ.ఉదయకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జె.ధీరజ్, జాయింట్ సెక్రటరీలుగా పి.ఉదయ నరసింహ, ఎస్.పవన్‌కుమార్, ఆర్‌ఎల్‌వీ మనోజ్ఞ, ట్రెజరర్‌గా హరహరపుత్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎస్.గోపాల్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఓ.సాయికుమార్, పరిశీలకునిగా పి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నా రాజకీయ ఎదుగుదలలో వైఎస్ పాల్‌రెడ్డి పాత్ర

మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

పులివెందుల రూరల్ : 'నా రాజకీయ ఎదుగుదలలో పారిశ్రామికవేత్త వైఎస్ ప్రకాష్‌రెడ్డి కుమారుడు దివంగత వైఎస్ పాల్‌రెడ్డి పాత్ర ఎంతో ఉంది' అని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పేర్కొన్నారు. శనివారం ఆయన అంబకపల్లె రోడ్డులో ఉన్న వైఎస్ మధురెడ్డి నివాసంలో వైఎస్ అభిషేక్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతంలో దివంగత వైఎస్ పాల్‌రెడ్డి తన రాజకీయ ఎదుగుదలకు ఎంతో తోడ్పాటు అందించారన్నారు. వారి కుటుంబం త్వరగా కోలుకోవాలని, వారికి గుండె ధైర్యాన్ని ఆ దేవుడు ప్రసాదించాలన్నారు. వైఎస్ అభిషేక్‌రెడ్డి ఏ లోకంలో ఉన్నా.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నానన్నారు.

నవీన్‌బాబుకు ఉత్తమ ప్రతిభా పురస్కారం



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న నవీన్ బాబు

కడప కోటిరెడ్డి సర్కిల్ : బ్రహ్మంగారిమఠం మండలం తోట్లపల్లి గ్రామానికి చెందిన రైల్వే తపాలా ఉద్యోగి జి.నవీన్ బాబుకు రైల్వే మెయిల్ సర్వీస్ క్యాటగిరిలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రతిభా పురస్కారం వరించింది. ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ వారు రాష్ట్ర వ్యాప్తంగా గత సంవత్సరం డిసెంబర్ నెలలో నిర్వహించిన తపాలా జీవిత బీమా ప్రత్యేక డ్రైవ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తపాలా ఉద్యోగులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. విజయవాడలో ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోస్టల్ సర్వీసెస్ బోర్డు మెంబర్ కె.ప్రకాష్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు.

ఆర్టీసీ బస్సులు కిటకిట

ప్రయాణికులతో నిండిన బస్టాండ్



కడప బస్టాండులో ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు కిక్కిరిసిన జనం

కడప కోటిరెడ్డి సర్కిల్ : తెలుగు వారి పెద్ద పండుగల్లో సంక్రాంతి ఒకటి. ఈ పండుగకు ఎక్కడ ఉన్నా ప్రతి కుటుంబం వారి, వారి ఊళ్లకు వెళ్లి సరదాగా గడపడం ఆనవాయితీగా వస్తోంది. తమ స్వస్థలాలకు వెళ్లాలంటే ప్రతి ఒక్కరూ దాదాపుగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతున్నారు. సంక్రాంతి పండుగకు సెలవులు రావడంతో పిల్లా, పెద్దలు కలిసి స్వగ్రామానికి బయలుదేరి వెళుతున్నారు. దీంతో ఏ బస్టాండు చూసినా ప్రయాణికులతో నిండిపోయింది. ఏ బస్సు చూసినా ప్రజలతో కిటకిటలాడుతోంది. పండుగ కోసం వారి, వారి స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల కోసం అన్ని డిపోల నుంచి బస్సులను సమకూర్చారు. ఇందులో జిల్లా నుంచి బయటి ప్రాంతాలకు, జిల్లా లోనూ ప్రయాణికులను చేర వేసేందుకు మొత్తం 260 బస్సులను ఏర్పాటు చేశారు. కడప నుంచి నెల్లూరు, తిరుపతి, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, కావలితోపాటు బెంగళూరు, చెన్నై, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కడప రీజినల్ మేనేజర్ పోలిమేర గోపాల్‌రెడ్డి రెండు రోజులుగా అన్ని డిపోల మేనేజర్లను, ట్రాఫిక్ అధికారులను అప్రమత్తం చేసి బస్సు ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఏదైనా మార్గ మధ్యంలో బస్సులు మొరాయిస్తే వాటి స్థానంలో ఇతర బస్సులను పంపించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వచ్చే వారి కోసం హైదరాబాద్‌లో 15 స్టాపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సిబ్బందిని కూడా నియమించి ప్రయాణికులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా బెంగళూరు నుంచి జిల్లా నలుమూలలకు ప్రయాణికులు చేరుకోవడానికి ఏర్పాట్లు చేశారు. విజయవాడ నుంచి విద్యార్థులు రావడానికి కూడా బస్సులను సమకూర్చారు. ప్రయాణికుల రద్దీ పెరిగేకొద్దీ అదనపు బస్సులను ఏర్పాటు చేస్తామని ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు.

కాలువలో జారిపడి బాలుడి గల్లంతు



జస్వంత్ (ఫైల్)

రాజుపాళెం : అభం శుభం తెలియని ముగ్గురు పిల్లలు ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి అందులో ఒక బాలుడు గల్లంతైన సంఘటన రాజుపాళెం మండలంలోని పగిడాల గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పగిడాల గ్రామానికి చెందిన పందిటి వెంకటయ్యకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటయ్య కుమారుడితో పాటు అతని అన్న కుమారులు, జస్వంత్ కలిసి ఆడుకుంటూ ఇంటి సమీపంలోని కేసీ చాపాడు కాలువలో జారి పడ్డారు. నీటిలో కొట్టుకు పోతున్న జస్వంత్ (9) ను కాపాడేందుకు మిగతా ఇద్దరు పిల్లలు శాయశక్తులా ప్రయత్నించినా దొరకలేదు. వెంటనే ఈ సమాచారాన్ని తల్లిదండ్రులకు, గ్రామస్తులకు తెలియజేశారు. వారితో పాటు పోలీసులు, ప్రొద్దుటూరు ఫైర్ స్టేషన్ అధికారులు తమ సిబ్బందితో కాలువలో గాలించారు. అయినా బాలుడి ఆచూకీ కనిపించలేదు. కాలువలో గల్లంతైన బాలుడు జస్వంత్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వైఎస్ అభిషేక్‌రెడ్డికి నివాళులర్పించిన కుటుంబ సభ్యులు, బంధువులు

పులివెందుల రూరల్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగపు ప్రధాన కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి శుక్రవారం మృతి చెందడంతో శనివారం ఆయన భౌతిక కాయాన్ని పులివెందులలోని వైఎస్ మధురెడ్డి నివాసంలో ఉంచారు. దీంతో వైఎస్ కుటుంబ సభ్యులు, బంధువులు వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డి, ఆమె తల్లి సుగుణమ్మ, సోదరుడు ఇసీ దినేష్‌రెడ్డి, సతీమణి ఇసీ వినీలతోపాటు వైఎస్ అభిషేక్‌రెడ్డి తండ్రి వైఎస్ మధురెడ్డి, తల్లి మాధవి, భార్య సౌఖ్య, మరదలు స్నేహారెడ్డి, తాతలు వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ఆనంద్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, కుమారులు వైఎస్ అరుణ్‌రెడ్డి, వైఎస్ కిరణ్‌రెడ్డి, వైఎస్ ప్రమీలమ్మ, వైఎస్ అభిషేక్‌రెడ్డి సోదరుడు వైఎస్ అభినవ్‌రెడ్డి, పాల్‌రెడ్డి కుమారుడు పాల్ కొండారెడ్డి, తల్లి మాధవి, కుటుంబ సభ్యులు, వైఎస్ అభిషేక్‌రెడ్డి మామ సర్వోత్తమరెడ్డి, మేనత్త మంజుల, వైఎస్ వెంకటరెడ్డితో పాటు వైఎస్ కుటుంబ సభ్యులు వైఎస్ అభిషేక్‌రెడ్డి పార్థీవ దేహం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి అనంతరం చర్చి ఫాదర్లచే ప్రార్థనలు నిర్వహించారు.



వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ భారతిరెడ్డి



బాధపడుతున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి భార్య సౌఖ్య



వైఎస్ అభిషేక్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేనత్త మంజుల



వైఎస్ అభిషేక్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మామ సర్వోత్తమరెడ్డి



వైఎస్ అభిషేక్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు



మనుమడు వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతదేహం వద్ద వైఎస్ ప్రకాష్‌రెడ్డి



వైఎస్ అభిషేక్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇసీ వినీల



వైఎస్ అభిషేక్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ వెంకటరెడ్డి



వైఎస్ అభిషేక్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత సతీష్‌రెడ్డి



వైఎస్ శివప్రకాష్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలతో పుత్తా నరసింహారెడ్డి

నిరాశ్రయులను ఆదుకోవడమే లక్ష్యం

వేంపల్లె : నిరాశ్రయులను ఆదుకోవడమే మానవతా స్వచ్ఛంద సంస్థ యొక్క లక్ష్యమని ఆ సంస్థ మండల అధ్యక్షుడు పి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఆలయాలు, బస్టాండు, నాలుగు రోడ్ల కూడలి, గండి వీరాంజనేయస్వామి దేవస్థానం తదితర ప్రాంతాల్లో ఉన్న దాదాపు 100 మంది నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ సేవా సహాయ చైర్మన్ కావలి కృష్ణతేజ, కన్వీనర్ రంగారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

ఎర్రగుంట్ల : ప్రముఖ స్వతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 218వ శత జయంతి వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో వడ్డే ఓబన్న చిత్ర పటానికి మండల, పట్టణ వడ్డేర సోదరులు, బీసీ సంఘం నాయకులు వడ్డేర సంఘం సమితి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఓబన్న భారతదేశ స్వతంత్ర్యం కోసం బ్రిటీష్ వారితో అలుపెరగని పోరాటం చేశారన్నారు.

మినీ గోకులం ప్రారంభం

జమ్మలమడుగు : గ్రామీణ ఉపాధి హామిపథకం కింద మినీ గోకులాలకు రైతులు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని పెద్దదండ్లూరు గ్రామంలో మినీ గోకులంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఈ పథకాన్ని సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ రామాంజనేయులరెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నిసా, పశుసంవర్ధకశాఖ జెడీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో గోకులం షెడ్లు..

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పెద్దనపాడు, తుమ్మలపల్లి గ్రామ పంచాయతీలలో మిని గోకులం షేడ్‌లను ప్రారంభించినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ రెండు గ్రామాలలో శనివారం గోకులం షేడ్‌లను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో వెటర్నీ శాఖ ఏడీ మునెయ్య, ఉపాధి హామీ పథకం ఏపీఓ గంగాభవాణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మృతి

వేముల : మండలంలోని అమ్మయ్యగారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చెల్లుబోయిన శ్రీరాములు (87) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డిలు అమ్మయ్యగారిపల్లె గ్రామానికి చేరుకుని శ్రీరాములు మృతదేహానికి నివాళులర్పించారు.

కోడిపందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు

సింహాద్రిపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా ఎక్కడైనా కోడి పందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ కోడి పందేల నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా కోడిపందేలు ఆడినా, జూదం ఆడినా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు కానీ, 9121100613, 100, 112 సంప్రదించాలన్నారు.

పెండ్లిమర్రి : సంక్రాంతి పండగ సందర్భంగా పెండ్లిమర్రి, వీరపునాయనిపల్లె మండలాల్లో కోడి పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని కడప రూరల్ సీఐ చల్లని దొర హెచ్చరించారు.

రేపు తాళ భజన పోటీలు

వల్లూరు : దుగ్గాయపల్లెలోని శ్రీ సీతారామాలయంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 7:30 గంటల నుంచి తాళ భజన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన భజన బృందాలకు మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ.. రూ.10 వేలు, మూడవ.. రూ.5 వేలు, నాలుగవ.. రూ.3 వేలు, ఐదవ.. రూ.2 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల భజన బృందాల వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఏపీజీబీ తరలింపు అన్యాయం

వల్లూరు : కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించడం అన్యాయమని, తరలింపు ఆపకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 12 తేదీ కడపలోని ఐఎంఏ హాల్‌లో సెమినార్ నిర్వహిస్తున్నామని, దీనికి కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి శైలజా నాథ్‌తో బాటు ఎమ్మెల్సీలు, సిపిఐ, సీపీఎం, ఆర్‌సీపీ నాయకులు పాల్గొననున్నారని, ప్రజలు విజయవంతం చేయాలని అన్నారు. సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆయన వల్లూరు మండలంలోని వివిధ వర్గాల ప్రజలకు పంచి పెట్టారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

తొండూరు : ప్రజలు సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. మండలంలోని తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మల్లేల గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నీటి నిల్వలలో అబైట్‌ను పిచికారి చేసి ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తాం

వివిధ మండలాల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు


వేంపల్లె చంద్రఓబుళరెడ్డి


లింగాల ఎం.వెంగల్‌రెడ్డి


సింహాదిరపురం దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి


చక్రాయపేట బైల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


ముద్దనూరు శ్రీధర్‌రెడ్డి


ఎర్రగుంట్ల తమ్మిశెట్టి బాలయ్య


తొండూరు భూమిరెడ్డి రవీంద్రారెడ్డి

వేంపల్లె : మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా మరోసారి కె.చంద్రఓబుల్‌రెడ్డిని అధిష్టాన వర్గం ప్రకటించింది. వైఎస్ఆర్ కుటుంబ సభ్యులకు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. ఎల్లవేళలా పార్టీకి శిరస్సు వహించి పనిచేస్తానన్నారు.

లింగాల : మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా అంబకపల్లె గ్రామానికి చెందిన ముద్దిగారి వెంగల్‌రెడ్డి(బాబు)ను పార్టీ అధిష్టానం నియమించింది. దీంతో ఆయన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సింహాద్రిపురం : వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

చక్రాయపేట : మండలంలోని పార్టీ శ్రేణులను కలుపుకుని వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేస్తానని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ముద్దనూరు : వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా శ్రీధర్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. తనను పార్టీ మండల కన్వీనర్‌గా నియమించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రగుంట్ల : వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా తమ్మిశెట్టి బాలయ్య, పట్టణాధ్యక్షుడిగా జయరామకృష్ణారెడ్డిలను వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిమించింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

తొండూరు : మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా భూమిరెడ్డి రవీంద్రారెడ్డిని పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. పార్టీ మండల ప్రజలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. గతంలో కూడా మండల అధ్యక్షుడిగా పనిచేశారు.

అభివృద్ధి రంగంలో మేటి పులివెందుల

- విద్య, వైద్య, వ్యాపార రంగాలలో దూసుకెళుతున్న వైనం
- పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత
- విదేశాలకు ఎగుమతి అవుతున్న అరటి
- పరిశుభ్రతలో మున్సిపాలిటీ ఆదర్శం
- రెండవ పసిడి పురికి ప్రాఖ్యాతగా నిలిచింది
- మధ్య రంగంగా పులివెందుల శ్రీరంగనాథస్వామి ఆలయం
- పారిశ్రామిక రంగంలో ఎంతోమందికి ఉపాధి



పులివెందుల పట్టణంలోని దేవి ఎలక్ట్రానిక్స్ అండ్ హోంనీడ్స్


పులివెందుల పట్టణంలోని పట్టాబి జ్యువెలర్స్ షాపు


శ్రీరంగనాథస్వామి సంత మార్కెట్‌లోని దశరథ కూరగాయల షాపు


పట్టణంలో మెయిన్ రోడ్డులోని సెంట్రల్ బోలేవార్డు

పులివెందుల టౌన్ : పులివెందుల ప్రాంతం విద్య, వాణిజ్య, వైద్య రంగాలలో మేటిగా నిలిచింది. పులివెందుల ప్రాంతంలోని అరటికి దేశ, విదేశాలకు ఎగుమతి అవుతోంది. దాంతోపాటు ఉద్యాన పంటలైన చీనీ, దానిమ్మ తదితర పంటలకు మంచి గిరాకీ ఉంది. పులివెందుల ప్రాంతం వైఎస్ కుటుంబీకులు ముఖ్యమంత్రుల హోదాలో ఉండటంతో ఎంతో అభివృద్ధి చెందింది. వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు సీఎం హోదాలో పులివెందులను అభివృద్ధి పథంలో నడిపించారు.

మధ్య రంగంగా శ్రీరంగనాథస్వామి ఆలయం :

పులివెందులలో వెలసిన శ్రీరంగనాథస్వామి ఆలయానికి ఎంతో ప్రాచీనత సంతరించుకుంది. తమిళనాడులోని శ్రీరంగం తర్వాత పులివెందుల శ్రీరంగనాథస్వామి ఆలయానికి మధ్య రంగంగా పేరొందింది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా ఇక్కడి శాసనాలు తెలుపుతున్నాయి.

అందానికే అందం పులివెందుల :

పులివెందుల మున్సిపాలిటీ అంటేనే అందానికే అందం అంటూ ఎంతో మంది ప్రశంసలు కురిపిస్తుంటారు. పులివెందులలో మున్సిపాలిటీకి ముందు నుంచే పరిశుభ్రతపై ఎక్కువ శ్రద్ధ వహించేవారు. ఇక్కడ వైఎస్ కుటుంబం ఉండటమే ప్రధాన కారణం. మున్సిపాలిటీపైన ప్రత్యేక చొరవ చూపి ప్రతి వార్డులోనూ, ప్రతి వాడలోనూ యూజీడీతోపాటు సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. ఎక్కడ డస్ట్‌బిన్ లేకుండా మున్సిపాలిటీ వాహనాలతో చెత్తను సేకరిస్తూ ఎప్పుడు పరిశుభ్రంగా ఉండటంవల్ల దోమలు కూడా చాలా తక్కువగా ఉంటున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా సెంట్రల్ బోలేవార్డు.. :

పులివెందుల పట్టణంలోని మెయిన్ రోడ్డులోని పాత ఆర్టీసీ బస్టాండు నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు నిర్మించిన సెంట్రల్ బోలేవార్డు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇక్కడ అన్ని రకాల ఫుడ్ కోర్టులు, ఎలక్ట్రానిక్స్, ఇతర వ్యాపార సముదాయాలు ఉండటంతో నిత్యం జనాలతో సందడిగా మారుతోంది.

సంతమార్కెట్‌కు ప్రత్యేక గుర్తింపు :

పులివెందులలోని శ్రీరంగనాథస్వామి కూరగాయల మార్కెట్‌కు పులివెందుల పుట్టినప్పటినుంచే ప్రత్యేక గుర్తింపు ఉంది. పలు జిల్లాల నుంచి కూడా సంతమార్కెట్‌కు వచ్చి కొనుగోలు చేసేవారు. ఈ మార్కెట్‌లో ఎర్రగడ్డలు, మామిడి కాయలు, నిత్యావసర సరుకులు, కూరగాయలు మహా నగరాలకు ఇక్కడి నుంచే ఎగుమతి అయ్యేవి.

ఆకర్షణీయంగా ఎలక్ట్రానిక్స్ అండ్ హోంనీడ్స్ :

పులివెందుల పట్టణంలోని జిల్లాలోని అతిపెద్ద షోరూంలుగా ఎలక్ట్రానిక్స్ అండ్ హోం నీడ్స్ సెంటర్లు ఉన్నాయి, దేవి ఎలక్ట్రానిక్స్అండ్ హోంనీడ్స్, అయ్యప్ప హోంనీడ్స్, ఎస్‌బీఎస్ హోంనీడ్స్, ఆరవేటి రాజా ఎలక్ట్రానిక్స్, ప్రిన్స్ ఎలక్ట్రానిక్స్, తదితరవి ఉన్నాయి.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత :

పులివెందుల పట్టణంలో జెఎన్‌టీయూ, ఫుడ్‌అండ్‌సైన్స్, టెక్నాలజీ, వ్యవసాయ, ఉద్యాన కళాశాలలు, లయోలా డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, బాలికల, బాలుర జూనియర్ కళాశాలలు, అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు అనేక ప్రైవేట్ పాఠశాలలైన స్వామి వివేకానంద, జీవన జ్యోతి, నివేదిత, నారాయణ, విద్యాధరి, నలంద, వికాస్, ఆదర్శ, రవితేజ పాఠశాలలు మంచి ప్రాచుర్యం పొందాయి.

వైద్య రంగంలో :

పులివెందుల పట్టణంలోని ఇసీ దినేష్‌రెడ్డి మెడికల్ సెంటర్‌తో పాటు రామతులశమ్మ, మారుతి, రజిని, నందిక, జ్యోతి, సిరి ప్రైవేట్ ఆసుపత్రులతోపాటు అధునాతన వసతులతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సర్వజన ఆసుపత్రి రోగులకు వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు ఉంది.

పరిశ్రమ రంగంలో :

పులివెందుల పట్టణంలోని భారతి ఫాలీమర్స్, శ్రీగోవిందరాజ టెక్స్‌టైల్స్, ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, సంయు గ్లాస్, ఆదిత్యా బిర్లా గార్మెంట్స్, ఏపీ కార్ల్‌లోని జినో మిక్స్, ఏపీ దొడ్ల డెయిరీ, సోలార్ పవర్ ప్లాంటు ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తోంది.

పసిడి పురిగా పులివెందుల :

పసిడి(బంగారు) రంగంలో మంచి పేరు గాంచింది. పసిడి ఆభరణాల తయారీలో ప్రొద్దుటూరు తర్వాత పులివెందులకు మంచి పేరు ఉంది. ఇక్కడ బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేందుకు ఎంతో మంది ఆసక్తి కనబరుస్తారు. బంగారు తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంవల్ల అమ్మవారిశాల వీధికి బంగారు అంగళ్ల వీధిగా నామకరణం ఉంది.

పర్యాటక రంగంలో :

పులివెందుల పట్టణంలోని శిల్పారామం, వైఎస్సార్ ఉలిమెల్ల లేక్, నగరవనం, గరండాల్ రివర్, శ్రీరంగనాథ స్వామి పార్కు, వైఎస్సార్ పార్కు, వైఎస్ జయమ్మ, వైఎస్ రాజారెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డి మోమోరియల్ పార్కులతోపాటు విపస్సాన మెడిటేషన్ సెంటర్, పలు ప్రాంతాలలో ఉన్న చిల్డ్రన్స్ పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.